



కాగడాల ప్రదర్శనలో పాల్గొన్న నాయకులు

గోవింద శంఖారావం

తిరుమల పవిత్రతను కాపాడుకుందాం అంటూ అమలాపురంలో భారీ నిరసన ప్రదర్శన

- లడ్డూ ప్రసాదం కల్తీ చేసిన దోషులను కఠినంగా శిక్షించాలి
- హిందూ సంఘాలు, కూటమి పార్టీల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ
- మాజీ సీఎం జగన్ దిష్టిబొమ్మ దహనం



భారీ ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 25: తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదాన్ని కల్తీచేసిన దోషులను కఠినంగా శిక్షించాలన్న ప్రధాన డిమాండ్‌తో గోవింద శంఖారావం పేరిట హిందూ సంఘాలు, కూటమి నాయకుల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం అమలాపురంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. మహిపాలవీధిలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద నుంచి వందలాది మంది నిరసన ర్యాలీగా బయలుదేరారు. ముమ్మిడివరం గేటు సెంటర్ మీదుగా గడియార స్తంభం సెంటర్‌కు చేరుకున్నారు. వైసీపీ పాలనలో హిందూ దేవాలయాలపై జరిగిన దాడులు, రథాలు, విగ్రహాల ధ్వంసం జరిగినా పట్టించుకున్న పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడేమో ఏకంగా కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవమైన కలియుగ దైవం తిరుమల వెంకన్న లడ్డూ ప్రసాదాన్ని వైసీపీ నేతలు కల్తీ చేయడాన్ని యావత్తు ప్రపంచం యావగించుకుందని విమర్శించారు. లడ్డూ ప్రసాదం కల్తీకి కారణమైన దోషులను తక్షణం అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. తిరుమల పవిత్రతను కాపాడుకుంటామంటూ వందలాది మంది కాగడాలతో ప్రదర్శన నిర్వహించారు. మాజీ సీఎం జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. నిరసనలో నాయకులు మెట్ల రమణబాబు, నల్లా పవన్‌కుమార్, మోకా వెంకటసుబ్బారావు, ఆకుల బుజ్జి, చిక్కం భీముడు, పిండి రాజా, గండి స్వామి, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూపరిషత్, భజరంగ్‌దళ్, ఇస్కాన్, సామాజిక సమరసతా వేదిక, గీతా మందిరం ప్రతినిధులు డాక్టర్ గోదశి గంగరాజు, పులిమే రాజా, శిరంగు నాయుడు, ఆకుల బాబి-శ్రీదేవి, కోకా రాంబాబు, మేడిశెట్టి నాగభూషణం, కోన గురుస్వామి, నల్లా త్రిమూర్తులు, వరదా సూరిబాబు, నల్లా కరుణాకర్ పాల్గొన్నారు.



అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో మాజీ సీఎం జగన్ దిష్టిబొమ్మ దహనం

ఆక్వా చెరువుల అఫిడవిట్‌ను

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు సమర్పించాలి

కలెక్టర్ మహేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) సర్వే నంబర్ల వారీగా స్టే ఆర్డరు జారీ చేసిన అక్రమ ఆక్వా చెరువులకు సంబంధించిన అఫిడవిట్‌ను జిల్లా మత్స్యశాఖ అధికారి ఎన్జీటీకి సమర్పించాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. అనుమతులు లేని ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయాలన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఎస్పీ బి.కృష్ణారావులతో కలిసి మత్స్యశాఖ, రెవెన్యూ సిబ్బందితో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. దేవదాయ, ఇతర ఆక్రమిత భూముల్లో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న అక్రమ ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రాజోలు, మలికిపురం, మామిడికుదురు మండలాల పరిధిలో 292 మంది రైతుల అధీనంలో సాగవుతున్న 688 ఎకరాల ఆక్వా సాగుకు సంబంధించి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించామన్నారు. పర్యావరణ పరిరక్షణ, సమతుల్యత చట్టాలను ఉల్లంఘించడంతో పాటు సర్వే నంబర్లు లేకుండా అక్రమంగా తీరప్రాంతంలో నిర్వహిస్తున్న అక్రమ ఆక్వా సేద్యం నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. జాతీయ హరిత ట్రిబ్యునల్, తీరప్రాంత ఆక్వా అథారిటీ నిబంధనలు, కోస్టల్ రీజియన్ జోన్, కాలుష్య నియంత్రణ మండలి వంటి అన్ని రకాల అనుమతులు తప్పనిసరిగా పొందాలన్నారు. ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ ఆక్రమిత అనధికార ఆక్వా సేద్యానికి సంబంధించి విద్యుత్ సరఫరా నిలుపుదల చేసేందుకు అవసరమైన పోలీసు రక్షణను మత్స్యశాఖ, ట్రాన్స్‌కో విభాగాలకు కల్పిస్తామని తెలిపారు. సమావేశంలో ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి ఎన్.శ్రీనివాస్, ట్రాన్స్‌కో ఈఈ రవికుమార్, తహసీల్దార్లు మృత్యుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ గారు రాలేదు..

వైద్య సేవలు అందలేదు..

● (ఆలమూరు)

- జీవో నంబర్ 85 రద్దు కోరుతూ పీహెచ్‌సీ వైద్యుల సమ్మె
- నిలిచిపోయిన ఓపీ సేవలు
- పేదలకు ఇబ్బందులు

డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 49 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏడు యూపీహెచ్‌సీలు, ఆరు సీహెచ్‌సీలు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతీరోజు వేలాది మందికి వైద్య సేవలు అందుతున్నాయి. ఈ ఆసుపత్రులలో దాదాపు 150 మంది వరకు వైద్యులు పనిచేస్తున్నారు. వీరు ఈనెల 17 నుంచి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమ్మెలోకి వెళ్లారు. దీంతో గత వారం రోజులుగా వైద్యసేవలు నిలిచిపోయాయి. ప్రస్తుతం స్థానికంగా ఉన్న నర్సుల సాయంతో పీహెచ్‌సీలు నడుపుతున్నారు. వైద్యులు లేకపోవడంతో ప్రజలు వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లక తప్పని పరిస్థితి దీంతో దిగువ స్థాయి వర్గాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పీజీలో ఇన్ సర్వీస్ కోటాకు సంబంధించి జీవో నెంబరు 85ను రద్దు చేయాలని అలాగే దీర్ఘకాలిక డిమాండ్లను నెరవేర్చాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు నిర్వహిస్తున్న సమ్మెతో ఆస్పత్రులు ఖాళీ అయ్యాయి. వారం రోజులుగా వైద్యులు ఓపీకి దూరంగా ఉండడంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు.



ఈ సమ్మెకు కారణం

పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులకు పీజీ సీట్ల భర్తీలో 50 శాతం కోటా ఉండేది. ఈ నేపథ్యంలో జీవో నంబర్ 85 విడుదలైంది. ఈ జీవోను అనుసరించి పీహెచ్‌సీ వైద్యులకు పీజీ సీట్ల కోటా కేటాయింపు భారీగా తగ్గింది. దీంతో సమ్మె బాట పట్టిన వైద్యులు తక్షణం ఆ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



డీఎంహెచ్‌వో దుర్గారావు దొరకు వినతిపత్రం అందిస్తున్న వైద్యులు(ఫైల్)

విజృంభిస్తున్న వైరల్ ఫీవర్స్

ఇటీవల కాలంలో వైరల్ ఫీవర్స్ అధికంగా ఉన్నాయి. చాలా మందికి వైద్య సహాయం అవసరం. గ్రామీణ ప్రాంతాల్లో ఎటువంటి అస్వస్థతకు గురైనా ముందుగా కనిపించేవి పీహెచ్‌సీలే. ఇప్పుడు ఆ పీహెచ్‌సీలో డాక్టర్లు లేకపోవడంతో చాలా మంది అనేక ఇబ్బందులు పడుతున్నారు. పీహెచ్‌సీల్లో వైద్యులు లేక అలా అని ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి సొమ్ము ఖర్చు పెట్టి వైద్యం చేయించుకోలేక సతమతమవుతున్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి వైద్యులు తిరిగి విధుల్లో చేరేలా కృషి చేయాలని పలువురు కోరుతున్నారు. ఆలమూరు మండలంలో రెండు పీహెచ్‌సీలు, ఒక సీహెచ్‌సీలలో కూడా పరిస్థితి అదుపు తప్పింది.

జనవరి నాటికి

జొన్నాడ ఫ్లైఓవర్ పూర్తవ్వాలి

కలెక్టర్ మహేష్‌కుమార్



పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వీక్షిస్తున్న కలెక్టర్

అమలాపురం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 216ఏపై జొన్నాడ వద్ద రూ.120 కోట్లతో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులను 2025 జనవరి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణ పనుల పురోగతిపై జాతీయ రహదారుల అథారిటీ ఆఫ్ ఇండియా ఇంజనీర్లు, కాంట్రాక్టర్లతో కలెక్టర్ బుధవారం సమీక్షించారు. ఇప్పటి వరకు జరిగిన పనులను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తిలకించారు. పనుల్లో జాప్యానికి తావు లేకుండా చూడాల్సిన బాధ్యత ఇంజనీర్లపై ఉందన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టినందున నిర్మాణ పనులను వేగవంతం చేస్తూ పూర్తి చేయాలన్నారు. 15 రోజులకోసారి పురోగతిపై నివేదిక సమర్పించాలని తెలిపారు. ఫ్లైఓవర్ నిర్మాణంలో పూడికకు అవసరమైన మట్టిని ప్రభుత్వ పరంగా సమకూర్చనున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, రాజమహేంద్రవరం జాతీయ రహదారుల అథారిటీ ఆఫ్ ఇండియా పథక సంచాలకుడు సురేంద్రనాథ్, ఇంజనీర్ ఎ.శ్రీనివాస్, జాతీయ రహదారుల అథారిటీ ఆఫ్ ఇండియా ఇంజనీర్ సాయినాథ్, కాంట్రాక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఏపీఈపీడీసీఎల్ జిల్లా తొలి ఎస్ఈగా రాజబాబు



రాజబాబును అభినందిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

అమలాపురం రూరల్, సెప్టెంబరు 25: ఏపీఈపీడీసీఎల్ జిల్లా తొలి సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా ఎస్.రాజబాబు బుధవారం ఈదరపల్లిలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. 2022లో జిల్లాల పునర్విభజన జీవో ప్రకారం ఇప్పటి వరకు ఇక్కడ నోడల్ అధికారిగా మోకా రవికుమార్ పనిచేశారు. విశాఖపట్నం కార్పొరేట్ కార్యాలయంలో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న రాజబాబు ఎస్ఈగా జిల్లాకు బదిలీ అయ్యారు. గతంలో ఆయన ముమ్మిడివరం సబ్ డివిజనల్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్‌గా పనిచేశారు. పుష్కరాల సమయంలోను డీఈగా విధులు నిర్వహించారు. జిల్లా పరిధిలో రెండు ఆపరేషన్ డివిజన్‌లు, ఒక టెక్నికల్, కనస్ట్రక్షన్ డివిజన్, ఒక ఎమ్మార్టీ డివిజన్ ఏర్పాటు చేశారు. టెక్నికల్, కనస్ట్రక్షన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా వై.విజయానంద్, రామచంద్రపురం ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా కె.రత్నాలరావు బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మార్టీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా మల్లిక నియమితులయ్యారు. ఇక జిల్లాకు సీనియర్ అక్కౌంట్స్ ఆఫీసర్ ఫైనాన్స్, అసిస్టెంట్స్ అక్కౌంట్స్ ఆఫీసర్ ఫైనాన్స్, డిప్యూటీ జనరల్ మేనేజర్, ముగ్గురు జేఏవోలు, 8 మంది సీనియర్ అసిస్టెంట్లు, 8 జూనియర్ అసిస్టెంట్లను నియమించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రాజబాబును రవికుమార్‌తో పాటు పలువురు అభినందించారు.

ఉచిత హక్కుల అసైన్డ్ భూముల

వివరాలు అప్‌లోడ్ చేయాలి

రెవెన్యూ సిబ్బందిని ఆదేశించిన కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): డి పట్టాలు జారీ చేసి 20 ఏళ్లు దాటిన అసైన్డ్ భూములకు ఉచిత హక్కులు కల్పించిన వివరాలన్నింటినీ వెబ్‌ల్యాండ్‌లో అందరికీ కనిపించేలా అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం రెవెన్యూ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. అసైన్డ్ భూములు, 22-ఏ భూములు, విలేజ్ సర్వీస్ ఈనాం భూములు, అడంగళ్ వివరాలు, డివిజన్ల వారీగా సమీక్షించారు. క్షేత్రస్థాయిలో భౌతిక విచారణ జరిపి వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. 20 ఏళ్లు పైబడిన అసైన్డ్ భూముల్లో ఒరిజినల్ అసైన్డ్ ఉన్నారా లేరా, లీగల్ ప్రకారం వారసులు ఉన్నారా, థర్డ్ పార్టీ అనుభవదారులుగా ఉన్నారా తదితర వివరాలను సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు జి.కేశవర్ధనరెడ్డి, జేవీవీ సత్యనారాయణ, తేజేశ్వరరావు, చినబాబు పాల్గొన్నారు.

ఇదేంటి బాస్?

రాష్ట్రంలో ప్రభుత్వం మారినా కొందరు పోలీసుబాస్‌ల వ్యవహారశైలి మారడం లేదు. ఇంకా గత వైసీపీ ప్రభుత్వ వాసనలతోనే ఇంకా వ్యవహరిస్తుండడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. దీనికి నిలువెత్తు ఉదాహరణే సీఐలు, ఎస్ఐల పోస్టింగ్‌ల వ్యవహారం. గత ప్రభుత్వంలో వైసీపీ ముఖ్యులు చెప్పినట్టల్లా తలూపిన కొందరు సీఐలు, ఎస్ఐలకు కొత్త ప్రభుత్వంలోనూ కీలక పోస్టులు దక్కగా, నిబంధనల ప్రకారం పనిచేసి సమర్థులుగా పేరు తెచ్చుకొన్న మరికొందరికి వీఆర్ బహుమానంగా ఇవ్వడం విమర్శలకు గురవుతోంది. ఇలా జరుగుతుందోనని బలవంతంగా వీఆర్‌లో ఉన్న పోలీసులకు అర్థం కావడం లేదు.



- పోలీస్‌శాఖలో గందరగోళంగా బదిలీల వ్యవహారం
- గత ప్రభుత్వంలో అడ్డగోలుగా వ్యవహరించిన కొందరికి ఏరికోరి పోస్టింగ్‌లు
- సమర్థవంతంగా పనిచేసిన మరికొందరికి పోస్టింగ్‌లు లేకుండా వీఆర్‌లోకి..
- ఉమ్మడి తూ.గో. జిల్లాలో 15మందికిపైగా వీఆర్‌లో కొనసాగుతోన్న సీఐలు
- 60మందికిపైగా ఎస్ఐలూ వీఆర్‌లో: ఏలూరు డీఐజీ పరిధిలో అత్యధికంగా తూ.గో.లోనే..
- ఒకపక్క పోలీసు బదిలీల్లో పారదర్శకతకు పెద్దపీట వేయాలని ప్రభుత్వం ఆదేశాలు
- కానీ కిందిస్థాయిలో కొందరు బాస్‌లు ప్రత్యేక ఆసక్తులతో పోస్టింగ్ నిర్ణయాలు
- మూడునెలలుగా అనేకమంది సీఐ, ఎస్ఐలకు పోస్టింగ్‌లు ఇవ్వకుండా ఇంకా వీఆర్‌లోనే..
- మెట్టతో సహా కాకినాడ సిటీ, రామచంద్రపురం, పెద్దాపురంల్లో పోస్టింగ్‌లపై విమర్శలు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

పోలీసుబదిలీల్లో సమర్థతకు పెద్దపీట వేయాలని కూటమి ప్రభుత్వం ఆదేశించినా కిందిస్థాయిలో కొందరు కీలక పోలీసుబాస్‌లు మాత్రం తమకు నచ్చినట్లు నిర్ణయాలు తీసుకుంటుండడం అనుమానాలకు తావిస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మూడునెలలుగా 15మందికిపైగా సీఐలు, 60మందికిపైగా ఎస్ఐలను వీఆర్‌లో ఉంచేశారు. వీరిలో అనేకమంది ఏ వివాదాలతో సంబంధం లేకపోవడం విశేషం. మరికొందరికి కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యేలు సిఫార్సు లేఖలు కూడా ఇచ్చారు.

అప్పుడు చెలరేగిపోయినా సరే..

పోలీసుశాఖలో అధికారుల బదిలీల వ్యవహారం గందరగోళంగా మారింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో పలువురు సీఐ, ఎస్ఐలకు ఎందుకు పోస్టింగ్ ఇస్తున్నారో, ఎందుకు వీఆర్‌లో ఉంచుతున్నారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వంలో వైసీపీకి అడ్డంగా కొమ్ముకాసి అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న వారికి కీలకస్థానాల్లో పోస్టింగ్‌లు లభించగా అప్పట్లో వేధింపులు, ఇబ్బందులకు గురై లూప్‌లైన్‌లో ఉన్నవారికి కీలక పోస్టింగ్‌లు దక్కడంలేదు. గత ప్రభుత్వంలో అడ్డగోలుగా చెలరేగిన వారికే మళ్లీ ప్రాధాన్యత లభిస్తుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. దీనివెనుక కొందరు పోలీసు ఉన్నతాధికారులు, వారి వ్యక్తిగత సహాయకుల పాత్ర ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. వీరు ప్రత్యేక శ్రద్ధతో విమర్శలు ఎదుర్కొంటున్న వారికి మంచి పోస్టింగ్‌లు ఇప్పించి, కొందరిని ఏకారణం లేకుండా వీఆర్‌కే పరిమితం చేయడంలో చక్రం తిప్పుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీని వెనుక ఏలూరు రేంజ్ పరిధిలో కీలక అధికారి కార్యాలయంలో కొందరు ఉన్నట్లు చర్చ జరుగుతోంది.

వివాదాలు లేకున్నా పోస్టింగ్ ఇవ్వరేం?

కాకినాడలో పనిచేస్తున్న ఓ ఇద్దరు సీఐలను ఆకస్మాత్తుగా వీఆర్‌కు పంపించేశారు. కానీ వీరిపై ఎలాంటి వివాదాలు లేవు. ఇందులో ఒకరికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఇటీవల స్పెషల్‌బ్రాంచ్‌కు పంపాల్సి ఉన్నా పోస్టింగ్ ఇవ్వకుండా తొక్కిపెట్టడం విశేషం. మరికొందరు సీఐలను మూడునెలలుగా వీఆర్‌లో ఉంచి పోస్టింగ్‌లు ఇవ్వకపోవడంపై ఉమ్మడి తూ.గో.జిల్లాలో అధికార పార్టీ నేతలే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ జిల్లా మెట్టప్రాంతం, కాకినాడ నగరం, పరిసర ప్రాంతాల్లో జరిగిన పోస్టింగ్ వ్యవహారాలు చర్చనీయాంశంగా మారాయి. ఇందులో భారీగా డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మెట్ట ప్రాంతానికి కేంద్రంగా ఉన్న ఒక సర్కిల్‌లో సీఐగా పనిచేసిన అధికారి గత వైసీపీపాలనలో చెలరేగిపోయారు. అలాంటి సీఐకి అదే ప్రాంతానికి చేర్చి ఉన్న సర్కిల్‌లో సీఐగా పోస్టింగ్ ఇవ్వడం తీవ్ర దుమారం రేపుతోంది. అతడు గతంలో పనిచేసిన ప్రాంతాల్లో తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. అలాంటి వ్యక్తికి ప్రభుత్వం మారినా అధికారులు పోస్టింగ్ ఎలా ఇచ్చారనే చర్చ జరుగుతోంది. కాకినాడ నగరంలోని ఓ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వోగా పనిచేసిన అధికారి గతంలో ఓ మహిళను ఈడ్చుకువెళ్లి పోలీసు జీపులో పడేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. అతను అప్పట్లో అధికార వైసీపీకి అనుకూలంగా పనిచేసినట్లు పక్కా ఆధారాలు ఉన్నాయి. ఇతడికి ప్రభుత్వం మారాక కూడా కాకినాడ నగరానికి సమీపంలోని ఓ పట్టణ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వోగా పోస్టింగ్ ఇచ్చారు. గతంలో కాకినాడ నగరంలో పనిచేసిన సీఐ అనేక ఆరోపణలు ఎదుర్కొనగా, కూటమి ప్రభుత్వం రాగానే బదిలీ చేశారు. తిరిగి నెలలు గడవకుండానే మరో కీలక విభాగంలో సీఐ పోస్టింగ్ దక్కించుకున్నారు. కాకినాడ నగరంలోనూ, నగరానికి చేర్చి ఉన్న సీఐల పోస్టింగ్ వ్యవహారంలో రూ.10 లక్షలనుంచి రూ.15లక్షల వరకు భారీగా సొమ్ములు చేతులు మారాయి. రియల్ ఎస్టేట్ వ్యవహారాలు అధికంగా జరిగే ఓ స్టేషన్ ఎస్‌హెచ్‌వో, మరో సర్కిల్ పోస్టింగ్ విషయంలో రూ.25లక్షలకు పైగా చేతులు మారినట్లు సమాచారం. మరోపక్క తమకు నచ్చనివారికి వైసీపీ ముద్ర వేసి పోస్టింగ్‌లు దక్కకుండా కొందరు అధికారులు చక్రం తిప్పారు. కాకినాడ జిల్లాలో మెట్టప్రాంతానికి చెందిన ఒక ఎమ్మెల్యే ఓ సీఐకి పోస్టింగ్ కోసం మూడు నెలలుగా పోరాటం చేస్తున్నారు. సదరు అధికారి గతంలో వైసీపీ నుంచి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు అతడికి పోస్టింగ్ ఇవ్వకుండా వీఆర్‌లో ఉంచారు. ప్రస్తుతం ఏలూరు రేంజ్ పరిధిలో 48మంది సీఐలు వీఆర్‌లో కొనసాగుతున్నారు. ఇందులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 15మంది, ఉమ్మడి పశ్చిమలో 18మంది ఉన్నారు. వీరిలో అనేక మంది సమర్థులు, ఏవివాదాలు లేకపోయినా వీరికి పోస్టింగ్ ఇస్తే తమకు ప్రయోజనం ఉండదనే కారణంతో వైసీపీ ముద్ర వేయడం విశేషం.

ఇదేం గందరగోళమో..

సామర్లకోటలో ఎస్‌హెచ్‌వోగా నియమితులైన సీఐ విషయంలో ఆరోపణలు రావడం, ఉన్నతాధికారులు సీరియస్ కావడంతో రోజుల వ్యవధిలోనే అతడిని మార్చివేయడం పోస్టింగ్‌ల్లో గందరగోళానికి నిదర్శనంగా నిలుస్తోంది. కొందరు బాస్‌లు సమర్థత కాకుండా ఇతర అంశాలు చూస్తుండడంవల్ల గందరగోళంతో పోస్టింగ్‌లు నవ్వులపాలవుతున్నాయనే చర్చ జరుగుతోంది. బదిలీలను గతంలో ఒకటి లేదా రెండు డీవోలతో పూర్తి చేసేవారు. కానీ ఇప్పుడు విచిత్రంగా ఎవరికి వారికే ప్రత్యేక డీవో లేదా అటాచ్‌మెంట్ ఇచ్చి పంపించడం లేదా మౌఖిక ఉత్తర్వులతో కొత్త ప్రదేశాల్లో చేరమని చెప్పడం వంటి వ్యవహారాలు జరుగుతున్నాయి. ఇటీవల రామచంద్రపురం ఎస్ఐ నియామకం వ్యవహారం కూటమి ప్రభుత్వంలో ఓ మంత్రి, ఎమ్మెల్యే మధ్య చిచ్చుకు దారితీసింది. గత వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా చెలరేగి టీడీపీ నేతలపై కేసులు పెట్టిన సదరు ఎస్ఐకి పోస్టింగ్ రావడం దుమారం రేపడంతో అప్పటికప్పుడు అతడిని వీఆర్‌కు పంపారు. ఎస్ఐల నియామకంలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 60మంది వరకు ఇంకా వీఆర్‌లో ఉన్నారు. వీరిలో ఒక్క కాకినాడ జిల్లాలోనే 25మంది వరకు ఉన్నారు.

వయసు 33..చోరీ కేసులు 44

దొంగల ఆటకట్టించిన తూర్పు పోలీసులు

400 గ్రాముల బంగారం, యాక్టివా బైక్ స్వాధీనం

వివరాలు వెల్లడించిన ఎస్పీ నరసింహ



చోరీ వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కంటికి కనబడిన ఇంటికి కన్నం వేయడంలో ఆరితేరిపోయారు. మూడు పదుల వయసులోనే నాలుగు పదుల కేసుల్లో చాలాసార్లు జైలుకు వెళ్లొచ్చినా దొంగబుద్ధిలో కొద్దిగా కూడా మార్పు రాలేదు. జైలుకు వెళ్లడం, విడుదల కావడం...మళ్లీ దొంగతనం చేయడం దైనందిన జీవనంగా మార్చుకున్న దొంగలను కొవ్వూరు పట్టణ పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. ఎస్పీ నరసింహ కిశోర్ వీటి వివరాలను వెల్లడించారు. కొవ్వూరులోని మహమ్మద్ మహారాజ్‌కి చెందిన అపార్ట్‌మెంట్‌లో కట్టా ఉషశ్రీ నివాసం ఉంటున్నారు. గతనెల 26న బెడ్‌రూంలో నిద్రించారు. తెల్లవారుజామున 4గంటల ప్రాంతంలో మేల్కొగా బీరువా తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించారు. బీరువాలోని బంగారు వస్తువులు, నగదు, సెల్‌ఫోన్, సెల్లార్లో ఉన్న యాక్టివా కనబడకపోవడాన్ని గుర్తించారు. దీనిపై అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. దీంతో ఎస్పీ ఆదేశాలతో కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ పర్యవేక్షణలో కొవ్వూరు పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ పి.విశ్వం ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఏపీఏ రోడ్డులో ఉం టున్న కాకినాడ జిల్లా ఏటిమొగకు చెందిన పొన్నాడ రవిశంకర్ (వీరబాబు)ను, భీమవరం పాలూరువారి వీధికి చెందిన లంకలపల్లి నాగరాజును అరెస్టు చేశామని ఎస్పీ తెలిపారు. యాక్టివా బైక్‌తోపాటు రూ.15.30లక్షల విలువ చేసే 400 గ్రాముల బంగారాన్ని రికవరీ చేశామన్నారు. మరికొంత బంగారాన్ని ఒక ఫైనాన్సులో కుదువ పెట్టారని దానిని రికవరీ చేయాల్సి ఉందన్నారు. గతంలో వీరబాబుపై పశ్చిమ గోదావరి జిల్లాలో 22, విశాఖలో 16, తూర్పు గోదావరిలో 2, శ్రీకాకుళంలో 2, విజయనగరం, అనకాపల్లి జిల్లాలో ఒక్కోటి కలిపి మొత్తం 44 కేసుల్లో జైలుశిక్ష అనుభవించాడని తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఒక కేసులో శిక్ష అనుభవించి విడుదల అయ్యాడన్నారు. రెండో నిందితుడు నాగరాజుపై గతంలో క్రికెట్ బెట్టింగ్‌పై భీమవరంలో, హత్యాయత్నంపై పాలకోడేరులో నమోదైన కేసుల్లో జైలుకు వెళ్లొచ్చాడని ఎస్పీ చెప్పారు. కేసును చేదించడంలో ప్రతిభ చూపిన కొవ్వూరు టౌన్, రూరల్ సీఐలు పి.విశ్వం, కె.విజయ బాబు, ఎస్ఐలు పి.రవీంద్రబాబు, కె.జగన్మోహన్ రావు, హెచ్‌సీలు కె.వెంకటేశ్వరరావు, జె.శ్రీనివాసరావు, ఆర్.సత్య నారాయణ, పీసీలు అప్సారీ బేగ్, శ్రీనివాసరావు, సుగుణ కుమార్, అనీల్‌కుమార్, బేగ్ రహమతుల్లా, రాజులను ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు

మరో కేసులో ఇద్దరు అరెస్టు

ఒక డ్రైవరును కత్తితో బెదిరించి ఉంగరాలు, నగదు చోరీ చేసిన కేసులో రాజానగరం పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం...రాజానగరం మండలం శ్రీరాంపురా నికి చెందిన వరదా మణికంఠ ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా కుంటలో నివసిస్తూ పండ్ల వ్యాపారం చేస్తున్నాడు. ఈ నెల 22న కుంట నుంచి బొలెరోలో వస్తూ గామన్ బ్రిడ్జి రోడ్డులోని నయారా పెట్రోల్ బంక్ సమీపంలో బహిర్భూమికి ఆగాడు. అప్పటికే అక్కడ తుప్పల్లో నక్కి ఉన్న ఇద్దరు వ్యక్తులు అతడిని కత్తితో బెదిరించి రెండు బంగారు ఉంగరాలు, సెల్‌ఫోన్, రూ.10వేలు లాక్కొని పారిపోయారు. దీనిపై బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేయగా సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. కొంతమూరుకు చెందిన సాలా బలరామ్(డీజే), బాలం ఏసులను నిందితులుగా గుర్తించి అరెస్టు చేసి, చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. హైవేలపై ప్రయాణించే వాళ్లు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే 112కి ఫోన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్, ఎస్ఐ మనోహర్, మహిళా ఎస్ఐ రేవతి, హెచ్‌సీ అమ్మిరాజు, పీసీలు పవన్‌కుమార్, వెంకటరమణను అభి నందించారు. అయితే బహిర్భూమికి వెళ్లడం వాస్తవం కాదని తెలుస్తోంది. ఆ ప్రాంతంలో వ్యభిచారం నిర్వహిస్తున్నారని, ఈ క్రమంలో విటులు బంగారు ఆభరణాలతో ఉన్నా, వాళ్ల వద్ద డబ్బు ఎక్కువగా ఉన్నట్లు గమనించినా సదరు మహిళలు తాము ముందు గానే ఏర్పాటు చేసుకున్న వ్యక్తులు లేదా తమకు అనుకూలమైన పోలీసులకు సమాచారం ఇచ్చి ప్లాన్ ప్రకారం దోపిడీ చేయిస్తారని ప్రచారం జరుగుతోంది. తర్వాత చోరీ సొత్తును వారంతా వాటాలు వేసుకుంటారని సమాచారం. చాలా మంది ఇలా దోపిడీకి గురైనా చట్ట వ్యతిరేక పని కావడంతో తమపైన కేసు పెడతారనే భయంతో మిన్నకుండిపోతున్నారు. దీంతో తాము దోపిడీకి గురైనా పోలీసులకు ఫిర్యాదు అందడం లేదని సమాచారం.

బలభద్రపురంలో దారుణ హత్య

మరిది చేతిలో హత్యకు గురైన వదిన



హత్యకు గురైన బుజ్జి

బిక్కవోలు, సెప్టెంబరు 25: బిక్కవోలు మండలం బలభద్రపురంలో మద్యం మత్తులో వదినను మరిది హత్య చేసిన సంఘటన జరిగింది. అనపర్తి సీఐ శివగణేష్ తెలిపిన వివరాల ప్రకారం డోకుబుర్ర బుజ్జి(40) మరిది అయిన డోకుబుర్ర గంగరాజు గ్రామంలో ఎదురెదురు ఇళ్లలో నివశిస్తున్నారు. మృతురాలి భర్త చనిపోయి నాలుగేళ్లు కాగా, కుమారుడు, కుమార్తెతో కలసి గంగరాజు ఇంటి ఎదురుగా వుంటున్నారు. ఆమె కుమారుడు శ్రీను పనిలోకి వెళ్లడం లేదంటూ మరిది గంగరాజు అతనిని కొట్టడంతో చొక్కా చిరిగిపోయింది. చిరిగిన చొక్కాతో ఇంటికి వచ్చిన కొడుకును ఏం జరిగిందని అడగ్గా విషయం చెప్పడంతో గంగరాజును ఎందుకు కొట్టావని బుజ్జి నిలదీసింది. దీంతో మద్యం మత్తులో వున్న గంగరాజు మరలా శ్రీనుని కొట్టడానికి ప్రయత్నించగా శ్రీను పారిపోతుండగా అడ్డుగా వెళ్లిన బుజ్జి పరుగెత్తి పడిపోయింది. దీంతో గంగరాజు అక్కడ వున్న సిమ్మెంటు ఇటుకతో ఆమె తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నామని సీఐ గంగరాజు వివరించారు. నిందితుడిని బిక్కవోలు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

మహిళను మోసంచేసి పెళ్లికి నిరాకరించిన వ్యక్తికి జైలుశిక్ష

అన్నవరం, సెప్టెంబరు 25: మహిళను నమ్మించి మోసం చేసి ఆపై పెళ్లికి నిరాకరించిన వ్యక్తికి న్యాయమూర్తి 12 ఏళ్ల జైలుశిక్ష విధించినట్లు ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల్లోకి వెళితే...కాకినాడ జిల్లా శంఖవరం మండలం గొంది గ్రామానికి చెందిన గంటిమల్లె సతీష్ (30) గత ఏడాది ఒక మహిళను తల్లిదండ్రులు లేని సమయంలో ప్రేమ..పెళ్లి పేరుతో మోసం చేసి ఆపై పెళ్లికి నిరాకరించడంతో అప్పట్లో ఆ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అప్పటి ఎస్ఐ బి.అజయ్‌బాబు అత్యాచారం కేసు నమోదు చేయడంతో రాజమండ్రి 8వ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్ జడ్జి వై.బెన్నయ్యనాయుడు 5వేల జరిమానా విధించారు. జరిమానా కట్టని పక్షంలో రెండేళ్ల జైలుశిక్షను విధిస్తూ తీర్పునిచ్చారని సీఐ తెలిపారు. ఫిర్యాది తరుపున పీపీ మారిశెట్టి వెంకటేశ్వరరావు వాదించారని ఆయన చెప్పారు.

పిఠాపురం అధికారుల వివాదంపై విచారణకు కమిటీ

ప్రభుత్వ ఆదేశాలు జారీ

పిఠాపురం, సెప్టెంబరు 25: పిఠాపురం పురపాలక సంఘంలో కమిషనరు, డీఈఈ మధ్య జరిగిన తోపులాట, వాగ్వివాదం వ్యవహారంపై విచారణకు ప్రభుత్వం ముగ్గురు ఉన్నతాధికారులతో కమిటీని నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం జీవో జారీ చేసింది.

ఆగస్టు 31న పిఠాపురం మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో కమిషనర్ కనకారావు, డీఈఈ భవానీప్రసాద్ కౌన్సిల్ సభ్యుల సాక్షిగా వాగ్వివాదానికి దిగి ఒకరిని ఒకరు తోసుకోవడంతోపాటు కొట్టుకున్నారు. అందరు తలదించుకునేలా బూతులు తిట్టుకున్నారు. ఈ వ్యవహారంపై అప్పట్లో మునిసిపల్ ఆర్డీ నాగనరసింహారావు, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ విచారణ జరిపి నివేదిక ఇచ్చారు. దీనిపై కలెక్టరు పంపిన నివేదిక ఆధారంగా మునిసిపల్ డీఈఈ భవానీశంకర్‌ను సస్పెండ్ చేశారు. ఇద్దరు అధికారుల మధ్య జరిగిన ఘర్షణ వ్యవహారానికి సంబంధించి పూర్తిస్థాయి విచారణ కోసం మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అడిషనల్ డైరెక్టరు పి.పూర్ణచంద్ర రావు, డిప్యూటీ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఎం.బ్రహ్మాజీ, టౌన్‌ప్లానింగ్ అడిషనల్ డైరెక్టరు బి.శ్రీనివాసులతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తూ పురపరిపాలనాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. 15 రోజుల్లోగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. దీని ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

18 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు వరంగల్‌లో తాత్కాలికంగా స్టాపు ఎత్తివేత

సామర్లకోట, సెప్టెంబరు 25: వరంగల్ సమీపాన విజయవాడ, ఖాజీపేట, బల్లార్షా సెక్షన్‌ల్లో హసన్‌పర్తి వద్ద నిర్వహిస్తున్న నాలుగో రైల్వేలైన్ పనులు, ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా సామర్లకోట మీదుగా హైదరాబాద్‌కు రాకపోకలు సాగించే 18 సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈ నెల 29 వరకూ వరంగల్ రైల్వేస్టేషన్‌లో స్టాపు తాత్కాలికంగా ఎత్తివేసినట్లు, ఈ కారణంగా కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఖాజీపేటలో నిలుపుదల ఇచ్చినట్లు దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

విశాఖ-సికింద్రాబాద్ మధ్య రాకపోకలు సాగించే గరీబ్‌రథ్(12739)ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 28 వరకూ, సికింద్రాబాద్-విశాఖ గరీబ్‌రథ్(12740)కు 26 నుంచి 29 వరకూ, షాలీమార్-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్, టాటా- యశ్వంత్‌పూర్ (18111)ఎక్స్‌ప్రెస్ 26న, సికింద్రాబాద్-విశాఖ (20707) వందే భారత్ ఎక్స్‌ప్రెస్ 26,27,28ల్లో, విశాఖ- సికింద్రాబాద్ (20708) వందే భారత్ ఎక్స్‌ప్రెస్ 27,28,29ల్లో, సికింద్రాబాద్- విశాఖ (20834) వందే భారత్ ఎక్స్‌ప్రెస్ 26,27,28ల్లో, విశాఖ-సికింద్రాబాద్(20833) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ 26,27,28ల్లో వరంగల్‌లో స్టాపు ఎత్తివేసి తాత్కాలిక ప్రత్యామ్నాయంగా ఖాజీపేటస్టేషన్‌లో స్టాపు ఇచ్చారు.

గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727) 26,27ల్లో, గోదావరి ఎక్స్‌ప్రెస్ (12728) 26,27,28ల్లో, మహబూబ్‌నగర్-విశాఖ (12862) ఎక్స్‌ప్రెస్ 26,27,28,29ల్లో, షాలీమార్-హైద్రాబాద్ (18045) ఎక్స్‌ప్రెస్ 26,27ల్లో, హైద్రాబాద్-షాలీమార్ (18046)ఎక్స్‌ప్రెస్ 26,27,28ల్లో, విశాఖ-షిర్డీసాయినగర్ (18503)ఎక్స్‌ప్రెస్ 26న, షిర్డీసాయినగర్-విశాఖ (18504)ఎక్స్‌ప్రెస్ 27న, షాలీమార్-సికింద్రాబాద్ (22849)ఎక్స్‌ప్రెస్ 26న, సికింద్రాబాద్-షాలీమార్ (22850)ఎక్స్‌ప్రెస్ 27న వరంగల్‌లో స్టాపు ఎత్తివేసారు.

బెంగుళూరు-భువనేశ్వర్ మధ్య రాకపోకలు సాగించే (18464) ప్రశాంతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 26న మధ్యాహ్నం 1.40 గంటలకు బదులుగా సాయంత్రం 4.10 గంటలకు బెంగళూరులో రీషెడ్యూల్‌లో బయలుదేరుతుంది. మరింత సమాచారం కోసం ఆయా సమీప రైల్వేస్టేషన్లలోని బుకింగ్ కార్యాలయాల వద్ద సంప్రదించాలని రైల్వే ఉన్నతాధికారులు ఆ ప్రకటనలో తెలిపారు.

విభిన్న ప్రతిభావంతులకు ఆన్‌లైన్ శిక్షణ..ఉద్యోగ అవకాశాలు: పీడీ లచ్చారావు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 25: విభిన్న ప్రతిభావంతులకు ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నామని వికాస పీడీ కె.లచ్చారావు తెలిపారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను ఆయన ఛాంబర్‌లో వికాస పీడీ లచ్చారావు, సార్థక్ సంస్థ ప్రతినిధి కిషోర్, విభిన్న ప్రతిభావంతులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నారాయణమూర్తి కలిసారు. ఈ సందర్భంగా వికాస ఆధ్వర్యంలో సార్థక్ సంస్థ ద్వారా విభిన్న ప్రతిభావంతులకు ఇచ్చే ఆన్‌లైన్ శిక్షణ గురించి కలెక్టర్‌కు వివరించారు. ఈ శిక్షణకు ఇంటర్, డిగ్రీ, బీటెక్ ఏళ్లలోపు 18 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. ఈ శిక్షణకు అర్హులైన వారు కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 77993 76111 నెంబరులో సంప్రదించాలన్నారు.

బాలికను గర్భవతి చేసిన దత్తత తండ్రి అరెస్టు

కె.గంగవరం, సెప్టెంబరు 25: బాలికను గర్భవతిని చేసిన దత్తత తండ్రిని అరెస్టు చేసినట్టు పామర్రు ఎస్ఐ కె.జానీబాషా చెప్పారు. మండలంలోని ఒక గ్రామంలో ఒక మహిళ తన బిడ్డను పిల్లలు లేని తన సోదరికి దత్తత ఇచ్చింది. ఆ తర్వాత తల్లి కూలి పనుల కోసం హైదరాబాద్ వెళ్లిపోయింది. బాలికకు 14 ఏళ్ల వయస్సులో 2022 సంవత్సరంలో దత్తత తండ్రి సత్తిబాబు బాలికపై పలు మార్లు లైంగిక దాడికి పాల్పడగా బాలికకు గర్భం వచ్చింది. దాన్ని తీయించడానికి అతడు బాలికను అప్పట్లో హైదరా బాద్ తరలించి అక్కడ ఒక నర్సింగ్ హోమ్‌లో చేర్చాడు. అక్కడ ఎంఎల్‌సీ ఇంటిమేషన్, బాధితురాలి స్టేట్‌మెంట్‌పై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. తర్వాత ఆ కేసును కోనసీమ జిల్లా ఎస్పీ ద్వారా పామర్రు పోలీసులకు బదిలీ చేశారు. అప్పట్లో పామర్రు పోలీసుస్టేషన్‌లో 22 సెప్టెంబరు 2022లో పోక్సో చట్టం క్రింద సత్తిబాబుపై కేసు నమోదు చేయగా, అప్పటి నుంచి సత్తిబాబు పరారీలో ఉన్నాడు. ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాలతో డీఎస్పీ బి.రామ కృష్ణ ఆధ్వర్యంలో సీఐ కె.అశోక్, తాను సిబ్బందితో ఎన్‌టీఆర్ జిల్లా గొల్లపూడి గ్రామంలో బుధవారం నిందితుడిని అరెస్టు చేసినట్లు చెప్పారు. కోర్టులో హాజరు పరుస్తామని ఎస్ఐ ఎస్కే జానీబాషా చెప్పారు.

ఎక్సైజ్ డీసీగా చైతన్య మురళి

కాకినాడ క్రైం, సెప్టెంబరు 25: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డిప్యూటీ కమిషనర్‌గా వై.చైతన్యమురళి కాకినాడ నాగమల్లితోటలోని ఆయన కార్యాలయంలో బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన డి.శ్రీకాంత్‌రెడ్డి శ్రీకాకుళం బదిలీ అయ్యారు. పోస్టింగ్ కోసం వెయిట్ చేస్తున్న చైతన్యమురళిని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పరస్పర ఫిర్యాదులపై విచారణ పూర్తి

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 25: కాకినాడ జిల్లా బాలల పరిరక్షణ విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది డీసీపీవో చదలాడ వెంకట్రావు, ఐసీపీఎస్ సోషల్ వర్కర్ ఒకరిపై ఒకరు ఇచ్చుకున్న ఫిర్యాదుపై విచారణ కమిటీ సభ్యులు విచారణ పూర్తి చేశారు. వారి నిర్ణయం ప్రకారం నివేదిక తయారు చేసి మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ గుంటూరు, జిల్లా కలెక్టర్‌కి అందించినట్లు పీడీ తెలిపారు. వారిద్దరూ ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. సోషల్ వర్క్ వారు ఐసీపీఎస్ కార్యాలయంలో విధులు నిర్వహించుకుంటూ ఇబ్బంది పడుతున్నారని భావించి తక్షణమే జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సంస్థ కాకినాడలో విధులు నిర్వహించాలని మౌఖికంగా ఆదేశించారు.

కాకినాడ ఆర్టీవో కార్యాలయంలో బదిలీలు

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబర్ 25: కాకినాడ జిల్లా ఆర్టీవో కార్యాలయంలో ముగ్గురు అధికారులు బదిలీ అయ్యారు. డీటీసీ ఎ.మోహన్ విజయవాడ బదిలీ కాగా ఆయన స్థానంలో కర్నూల్ డీటీసీ శ్రీధర్ రానున్నారు. పరిపాలన అధికారి(ఏఓ) సత్తిబాబు రాజమహేంద్రవరం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అక్కడ పనిచేస్తున్న పెన్సిస్‌బాబు ఇక్కడ బాధ్యతలు చేపట్టనున్నారు. ఏఎంవీఐ షణ్ముఖ శ్రీనివాస్ రావులపాలెం బదిలీ కాగా అక్కడ పనిచేస్తున్న నాగేంద్ర ఆయన స్థానంలో ఇక్కడ బాధ్యతలు చేపట్టారు.

ఎక్సైజ్ సూపరింటెండెంట్ బాధ్యతల స్వీకరణ



కాకినాడ క్రైం, సెప్టెంబరు 25: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కాకినాడ జిల్లా సూపరింటెండెంట్‌గా కృష్ణకుమారి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆమె విశాఖపట్నం సెబ్ సూపరింటెండెంట్‌గా పనిచేశారు. ఇటీవల ప్రభుత్వం సెబ్‌ను రద్దు చేయడంతో ఆమె పోస్టింగ్ కోసం వెయిట్ చేస్తున్నారు. సామర్లకోట డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న ప్రసాద్ కోనసీమ జిల్లా అమలాపురానికి బదిలీ అయ్యారు.

చిరుతపులి కదలికలపై మంత్రి దుర్గేష్ ఆరా





అటవీశాఖ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్. నర్సరీలో పరిసరాలను పరిశీలిస్తున్న ఫారెస్టు సిబ్బంది

కడియం, సెప్టెంబరు 25: కడియంలో చిరుతపులి సంచారంపై ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. బుధవారం కడియం వచ్చిన మంత్రి దుర్గేష్ అటవీశాఖ అధికారులను ఆరా తీశారు. పులి సంచారంపై వెంటనే చర్యలు తీసుకుని ప్రజలకు భయాందోళనలు లేకుండా చూడాలని అటవీశాఖ అధికారులకు సూచించారు. రైతు తిరుమలశెట్టి భాస్కరరావు నర్సరీ నుంచి చెక్కపల్లి సత్తియ్య చేను వైపు చిరుతపుల్లి వెళ్లినట్లు పాదముద్రలను అటవీశాఖ అధికారులు గుర్తించారు.

● ట్రాప్ కెమేరాలు ఏర్పాటు

చిరుతపులి కదలికలను గుర్తించడానికి ట్రాప్ కెమేరాలు, సీసీ కెమేరాలు అమర్చినట్లు జిల్లా అటవీశాఖ అధికారి ఎస్. భరణి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం...కడియం నుంచి వీరవరం వెళ్ళే రోడ్డులో దోసాలమ్మకాలనీ దగ్గరలోనున్న ఎస్ఎస్‌టీసీ నర్సరీలో చిరుతపులి పాదముద్రలు గుర్తించామన్నారు. అర్ధరాత్రి నుంచి కురిసిన వర్షం కారణంగా వాటి ఆనవాళ్లు పోయాయన్నారు. గతంలో వరదల సమయంలో గోదావరి మీదుగా వచ్చి ఉంటుందని భావిస్తున్నామన్నారు. బుర్రిలంక సమీపంలో గోదావరి లంకల్లో జింకలు ఉండటంతో అటువైపుగా వెళుతుందని భావిస్తున్నట్లు తెలిపారు. చిరుత పులి కదలికలను గుర్తించడానికి సిబ్బంది బృందాలుగా ఏర్పడి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు.

● కడియం నర్సరీ అసోసియేషన్‌తో సమావేశం

అటవీశాఖ అధికారులు నర్సరీ అసోసియేషన్‌తో సమావేశం అయ్యారు. నర్సరీ సంఘం అధ్యక్షుడు మల్లు పోలరాజు, కార్యవర్గ సభ్యులతో మాట్లాడారు. నర్సరీల్లో పనిచేసే కార్మికులు ముగ్గురు లేదా నలుగురు కలిసి వెళ్ళాలన్నారు. చేతిలో కర్ర, టార్చ్‌లైటు దగ్గర ఉంచుకోవాలన్నారు. ఇరుకు షెడ్‌లు ఉన్న నర్సరీ రైతులు ముందుగా టార్చ్‌లైటుతో అంతా పరిశీలించి తరువాతే షెడ్డు తాళం తీయాలని సూచించారు. అసత్య ప్రచారాలు చేసిన వారిపై పోలీసుశాఖ చర్యలు తీసుకుంటుందన్నారు.



సుబ్బంపేట వద్ద బీచ్ రోడ్డుకు రక్షణగా ఏర్పాటు చేసిన బండరాళ్ళను తాకుతున్న కెరటాలు

ఉప్పాడ తీరంలో అలల ఉధృతి

కొత్తపల్లి, సెప్టెంబరు 25: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. తీరం వెంబడి ఈదురు గాలులు వీస్తున్నాయి. దీంతో అలలు ఉధృతంగా ఎగసిపడతున్నాయి. ఉవ్వెత్తున ఎగసిపడే కెరటాలు సుబ్బంపేట, కొత్తపట్నం వద్ద బీచ్‌రోడ్డుకు రక్షణగా ఏర్పాటు చేసిన బండ రాళ్ళను తాకుతున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా ఉండటంతో తీరప్రాంతాలకు చెందిన మత్స్యకారులు బుధవారం వేటను విరమించారు. అలివితో వేటాడే మత్స్యకారులు యధావిధిగా వేటను కొనసాగించారు.

ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

వీసీ ఆచార్య శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 25: యువత ఉద్యోగం చేస్తున్న ప్రదేశంలో అనుభవాన్ని, నైపుణ్యాలను పెంపొందించుకుని ఉన్నత స్థానాలకు చేరుకునే దిశగా అడుగులు వేయాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ప్లేస్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ప్రముఖ ఫార్మా కంపెనీ డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్‌లో ఉద్యోగాలకు బుధవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. విశ్వవిద్యాలయం ప్రాంగణంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి బీఎస్సీ మైక్రో బయాలజీ, బయో టెక్నాలజీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ పూర్తిచేసిన 103 మంది మహిళా అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరికి రాతపరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించి హైదరాబాద్, విశాఖపట్నం రెడ్డీస్ ల్యాబ్‌లో ఉద్యోగాలు కల్పిస్తారని వీసీ తెలిపారు. అనంతరం ఇంటర్వ్యూలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేశారు. ఎంపిక తర్వాత డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ హెచ్.ఆర్, బి.శరణ్య మాట్లాడుతూ హైదరాబాద్, విశాఖపట్నం రెడ్డీస్ ల్యాబ్‌లో పనిచేయడానికి 38 మంది విద్యార్థులను ఎంపిక చేసి ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. భవిష్యత్‌లో ప్రాంగణ ఎంపికలకు నన్నయ విద్యార్థులకు ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో నన్నయ విశ్వవిద్యాలయం ప్లేస్‌మెంట్ విభాగం కోఆర్డినేటర్ బి.జగన్మోహనరెడ్డి, రెడ్డీస్ ల్యాబ్ విభాగ అధిపతులు జె.వెంకట సురేష్, బి.అప్పారావు, ఎస్.అశోక్, మురగన్, గజేంద్రకుమార్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో ధీరూభాయ్ అంబాని క్విజ్ పోటీలు



అంబాని క్విజ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, సెప్టెంబరు 25: తూర్పుగోదావరి జిల్లాలో ధీరూభాయ్ అంబాని క్విజ్ పోటీలు నిర్వహించేందుకు రిలయన్స్ సంస్థ ప్రతినిధులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ పోటీలను కాకినాడ జిల్లా, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్‌లో చదివే 8, 9, 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించనున్నారు. డిసెంబర్ 5న రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో, 6న అమలా పురం అంబేడ్కర్ భవన్‌లోను, 7న కాకినాడ అంబేడ్కర్ భవన్‌లో మధ్యాహ్నం 12 గంటల నుంచి ఈ క్విజ్ పోటీలు జరపనున్నారు. విషయ పరిజ్ఞానం, ప్రపంచ, భారతదేశ చరిత్ర, సామాజిక అంశాలు క్విజ్ పోటీలలో ప్రధాన అంశాలుగా ఉన్నాయి. ఒక్కో టీమ్‌లో ఇద్దరు విద్యార్థుల చొప్పున ఒక్కో స్కూల్ నుంచి రెండు టీమ్‌లను అనుమతించ నున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్ విద్యార్థులకు వేర్వేరుగా క్విజ్ పోటీలు నిర్వహించనున్నారు. ప్రభుత్వ స్కూల్స్ టీమ్‌లను ప్రయాణ ఖర్చులు ఇవ్వనున్నారు. విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేయనున్నారు. ఆసక్తిగల విద్యార్థులు నవంబరు 30వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలి. పేర్లు నమోదుకు సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య ఫోన్ నెంబర్లు 0884 3577222, 63022 23156 నెంబర్లలో తెలియజేయాలి. ఈ మేరకు మూడు జిల్లాల్లో విద్యాశాఖాధికారుల ద్వారా రిలయన్స్ సంస్థ ప్రతినిధులు క్విజ్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. పోస్టర్ ఆవిష్కరణలో తూర్పుగోదావరి జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, ఏడీ వెంకటరాజు, సీఎంవో శ్రీనివాసరావు, రిలయన్స్ సీఎస్ఆర్ హెడ్ పి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. వివరాలకు 99599 88835, 0884 6677555లలో సంప్రదించాలని సంస్థ ప్రతినిధులు తెలిపారు

పిచ్చికుక్క స్వైర విహారం

● 24 మందికి గాయాలు

● బాలుడి చేతివేలును కొరికిన వైనం

రౌతులపూడి, సెప్టెంబరు 25: పిచ్చికుక్క స్వైరవిహారం చేసి ఆరు గ్రామాల్లో 24 మందిని గాయపరిచింది. ఈ ఘటనలో ఒక బాలుడి చిటికిన వేలు పూర్తిగా తినేసింది. ఎట్టకేలకు కొంత మంది చేతుల్లో మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. .కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం ఎం.కొత్తూరు గ్రామంలో ఒకరిని గాయపరిచి తదనంతరం మూలగపూడి వెళ్లి 13 మందిని గాయపరిచింది. అక్కడ నుంచి బలరామపురం గ్రామంలో నలుగురిని, ఎ.మల్లవరంలో ముగ్గురిని, రౌతులపూడిలో ఇద్దరిని, ఎస్.పైడిపాలలో ఒకరిని గాయ పరిచింది. వారందరికి రౌతులపూడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నందించారు. ఎ.మల్లవరం గ్రామానికి చెందిన చెందాడ వీరబాబు కుమారుడు చెందాడ సన్నిబాబు(8) చేతి చిటికేలు వేలును పూర్తిగా తినేసింది. మూలగపూడిలో హైస్కూల్ హిందీ ఉపాధ్యాయుడు దేవరాజుపై దాడి చేసింది. బలరామపురంలో దాన్ని కుక్కను చంపేశారు.

జగ్గంపేట సీహెచ్‌సీలో అరుదైన ఘటన

4.5 కిలోల ఆడబిడ్డ జననం



తల్లిబిడ్డలతో డాక్టర్ల బృందం

జగ్గంపేట, సెప్టెంబరు 25: కాకినాడ జిల్లాలో జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో వైద్యుల పర్యవేక్షణలో ఓ మహిళ సాధారణ కాన్పు ద్వారా 4.5 కిలోల ఆడబిడ్డకు జన్మించింది. జగ్గంపేట మండలం మల్లిపాక గ్రామానికి చెందిన టి.అచ్చివేణి నెలలు నిండడంతో జగ్గంపేట ప్రభుత్వాసుపత్రిలో కాన్పు నిమిత్తం చేరింది. ఆమెకు అన్ని రకాలుగా పరీక్షించిన వైద్యులు సిజేరియన్ అవసరం లేకుండా డాక్టర్ ప్రణీత ఆధ్వర్యంలో ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ వర్మ నేతృత్వంలో సాధారణ కాన్పు వేశారు. ఈ కాన్పులో 4.5 కిలోల ఆడబిడ్డకు ఆమె జన్మనిచ్చింది. సాధారణంగా అంత బరువు ఉన్న పిల్లలకు సిజేరియన్ ద్వారా కాన్పు వేయడం జరుగుతుంది. కానీ జగ్గంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ కాన్పు వేసి డాక్టర్లు శభాష్ అనిపించుకున్నారు. వైద్యులు, వైద్య సిబ్బందికి అచ్చివేణి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పసికందుకు అరుదైన చికిత్స

జీజీహెచ్(కాకినాడ), సెప్టెంబరు 25: ప్రాణాపాయంలో ఉన్న రెండు నెలల పసికందుకు కాకినాడ జీజీహెచ్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించి పునర్జన్మను ప్రసాదించారు. ఇందుకు సంబంధించి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి బుధవారం వివరాలను వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు గ్రామానికి చెందిన కామేశ్వరరావు భార్య గంగకు గతనెల రెండో వారంలో కాకినాడలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో మగ శిశువు జన్మించాడు. తక్కువ బరువున్న 1.7 కిలోలు ఉన్న ఆ శిశువుకు అవయవాలు పూర్తిగా అభివృద్ధి చెందకపోవడంతో తల ఆకృతి కూడా సరిగా లేకుండా ట్రై గోనో సెఫాలీ అనే ఒక అరుదైన వ్యాధితో శిశువు జన్మించిందని వైద్యులు గుర్తించారు. అనంతరం శిశువుకు పలు వైద్య పరీక్షలు నిర్వహించి గతవారంలో న్యూరోసర్జరీ విభాగాధిపతి డాక్టర్ విజయశేఖర్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కోదండ గిరిరావ్, అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, పిడియాట్రిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ డి.మాణిక్యాంబ ఆధ్వర్యంలో స్ట్రిప్ క్రేనియాక్టమి అనే అరుదైన శస్త్రచికిత్సను నిర్వహించి విజయవంతమయ్యారు. ఇటువంటి శస్త్రచికిత్స జీజీహెచ్‌లో నిర్వహించడం మొట్టమొదటిసారని డాక్టర్ లావణ్యకుమారి తెలిపారు. శిశువు కుటుంబీకులు తమ బిడ్డకు పునర్జన్మను ప్రసాదించిన వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అవలంబించాలి

అంబాజీపేట, సెప్టెంబరు 25: వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అవలంబించి నాణ్యమైన దిగుబడులు సాధించాలని పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ మోహనరావు అన్నారు. వక్కలంక, మొసలపల్లి గ్రామాల్లో బుధవారం సీహెచ్‌వీ విజయకుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వాసంశెట్టి రేవతి, ఎంపీటీసీ నూకపెయ్యి సత్యనారాయణ, హార్టీకల్చర్ ఏవో వెంకటేశ్వరరావు, ఎఈవో డి.దుర్గారావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 25: రానున్న రబీ సీజన్ నాటికి రైతు సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో నీటి పారుదల, డ్రైనేజీ, ఆర్‌డబ్ల్యూఎస్, రోడ్లు భవనాలు, వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు, రైతుల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పంటకాలువలు, డ్రైన్లు నిర్వహణ లేకపోవడం, రైతు సమస్యలపై దృష్టిసారించక పోవడంతో సమస్యలు పెరిగి రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి శాఖల వారీగా ప్రణాళికలు రూపొందించాలని కోరారు. మండలాలు, పట్టణం నుంచి రైతులు కమిటీలుగా ఏర్పడాలని సూచించారు. కాలువల్లో పూడిక తీయించాలన్నారు. పాడైన స్లూయిజ్‌లు, లాకుల మరమ్మతులు చేయించాలని హెడ్‌వర్క్స్ అధికారులను ఆదేశించారు. రైతులు అధికారుల ముందు సమస్యలు ఏకరువు పెట్టారు. డ్రైన్లు, సాగునీటి కాలువ దుస్థితి వివరించారు. నీటిపారుదల శాఖ, డ్రైనేజీ, రోడ్లు భవనాలు, హెడ్‌వర్క్స్, వ్యవసాయశాఖ అధికారులు, మాజీ ఏఎంసి చైర్మన్ గరిగిపాటి సూర్యనారాయణ మూర్తి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్,వాసంశెట్టి సత్యం,తెలుగురైతు విభాగం అధ్యక్షుడు శివప్రసాద్, మాజీ ఎంపిటిసి విత్తనాల వెంక రమణ, మాజీ కౌన్సిలరు దంగేటి గౌరీశంకర్ రైతులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ తీరుపై కాంగ్రెస్ వినూత్న నిరసన



కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ నిరసన శిబిరంలో మాట్లాడుతున్న జిల్లా శాఖ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిట్టిబాబు

అమలాపురం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ కాంగ్రెస్ జిల్లా శాఖ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన శిబిరం నిర్వహించారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పిలుపు మేరకు థాలీ బచావో కార్యక్రమం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు కంచాలపై గరిటెలు వాయిస్తూ నిరసన తెలిపారు. పీసీసీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు ఇస్తామని, ఇలా ఎన్నో హామీలు ఇచ్చి ఇంత వరకు అమలు చేయలేదన్నారు. జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు మాట్లాడుతూ ఏం సాధించారని వంద రోజుల పండుగ చేసుకుంటున్నారని కూటమి నేతలను ప్రశ్నించారు. నిరసనలో జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి, పట్టణశాఖ అధ్యక్షుడు వంటెద్దు బాబి, చీకట్ల అబ్బాయి, యార్లగడ్డ రవీంద్ర, కుడుపూడి శ్రీనివాస్, వడ్డి నాగేశ్వరరావు, మాచవరపు శ్రీమన్నారాయణ, అడపా వీరనూకమాచరరావు, అరిగెల రాంబాబు, కొండేటి స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

రెడీమేడ్ గృహోపకరణ వస్తువులపై ఆంక్షలు విధించాలి



వినతిపత్రం అందజేస్తున్న సూర్యనారాయణమూర్తి తదితరులు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 25: వేప కర్రలతో కిటికీలు, గుమ్మాలు తయారుచేసి టింబరు డిపోల్లో విక్రయించడం వల్ల చేతివృత్తినే నమ్ముకున్న కార్పెంటర్లు ఉపాధిని కోల్పోతున్నారని, దీనిపై అటవీశాఖ అధికారులు దృష్టి సారించాలని కోరుతూ వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో బుధవారం ఈదరపల్లిలోని అటవీశాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. భవన నిర్మాణ గృహోపకరణ వస్తువులపై ఆంక్షలు విధించాలని కోరారు. భవన నిర్మాణ కార్పెంటర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో అభ్యర్థించారు. కార్యక్రమంలో గున్నేపల్లి భీమశంకరం, కొనుకు వెంకటేశ్వరరావు, కేతా సోమేశ్వరరావు, కొప్పూరి శ్రీనివాసరావు, యర్రంగడ్డ హనుమకుమార్, కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు, జల్లి సత్యనారాయణ, పొలమూరి రామకృష్ణ పాల్గొన్నారు.

కమిషనర్‌కు ఉద్యోగుల అభినందనలు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 25: అమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజును ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా ప్రతినిధి కె.సత్తిబాబు ఆధ్వర్యంలో బుధవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కొప్పుల కృష్ణ, మల్లారపు సత్యనారాయణ, నిమ్మకాయల శ్రీనివాసరావు, కానేటి వెంకట్రావు, మెండు చిన్నా తదితరులు కలుసుకుని అభినందనలు తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర పునర్నిర్మాణం

- కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్
- పలు మండలాల్లో ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమాలు
- కరపత్రాలు పంపిణీ చేసిన ప్రజాప్రతినిధులు





కె.గంగవరం: మాట్లాడుతున్న మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆత్రేయపురం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, రాయవరం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

కె.గంగవరం, సెప్టెంబరు 25: గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని నాశనం చేసిందని, కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్ర పునర్నిర్మాణం చేస్తున్నామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. బుధవారం కుందూరులో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేద వాడికి ఆకలి తీర్చడానికి అన్నక్యాంటీన్లు ప్రారంభించామన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోని అభివృద్ధిపథంలో నడిచించి స్వర్ణాంధ్రప్రదేశ్‌గా పునర్నిర్మాణం చేస్తామని చెప్పారు. ఈసభలో ఆగస్టు నెలలో గోదావరి వరదల కారణంగా కోట గ్రామానికి చెందిన పశువులు గల్లంతైన నిమిత్తం మంజూరైన నష్టపరిహారం రూ.2లక్షలు చెక్కులు లబ్దిదారులకు అందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, బీజేపీ ఇన్‌ఛార్జ్ దూడల శంకరనారాయణ, కూటమి నాయకులు చిర్రా రాజ్‌కుమార్, అవసరాల రమణ మూర్తి, పామర్తి బాబి, మేడిశెట్టి బాబి, చిర్రా సురేష్, జగతా రమణ, కాకినాడ రామారావు, మేడిశెట్టి సూర్యానారాయణ, సలాది రమేష్, చొల్లంగి ఎదుర్లయ్య, పశుసంవర్ధకశాఖ ఏడీఏ ఓ.రామకృష్ణ, పశువైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన

రాయవరం, సెప్టెంబరు 25: సీఎంచంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ సారథ్యంలో రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగుతోందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. బుధవారం చెల్లూరులో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు.అనంతరం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చాట్రాతి జానకి రాంబాబు, పాలిక రాఘవ, ఎంపీటీసీలు గొల్లపల్లి అనురాధ, వైట్ల సతీష్, ఉండవిల్లి సుబ్బారాయుడు, ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి, ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి, కూటమి నేతలు చంద్రు వీర్రాజు, దేవు వెంకట్రాజు, రిమ్మలపూడి వేణుగోపాలదొర, మోరంపూడి రాజ్‌కుమార్, నూనె శ్రీదేవి, మురకొండ విజయ దుర్గారావు, ముత్యాల అనురాధ, వల్లూరి సత్యప్రసాద్, దాలిపర్తి శ్రీను, మాజీ జడ్పీటీసీ కాదా ప్రభాకరరావు, ఎంఈవో వై.సూర్యనారాయణ, కూటమి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజలు సంతృప్తి

అంబాజీపేట, సెప్టెంబరు 25: కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనపై ప్రజలు సంతృప్తితో ఉన్నారని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబాజీపేట మార్కెట్ యార్డులో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారివెంటసుబ్బారావు అధ్యక్షతన బుధవారం జరిగిన ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ విశేష కృషిచేస్తున్నారన్నారు. ఈనెల27న పి.గన్నవరం నిర్వహించే మెగాజాబ్ మేళా పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ శివశంకరప్రసాద్, ఎంపీడీవో జీవీ సరోవర్, తహసీల్దారు వెంకటేశ్వరి, నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ నామన రాంబాబు, కోకన్వీనర్ దాసరి వీరవెంకట సత్యనారాయణ, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు గణపతి వీరరాఘవులు, నాగాబత్తుల సుబ్బారావు, నాయకులు బొంతు పెదబాబు, కోర్లపాటి గోపి, వాసంశెట్టి కుమార్, దొమ్మేటి సాయికృష్ణ, గుడాల ఫణి, నేదునూరి పెద్దిరాజు, మానుపాటి గోవిందు పాల్గొన్నారు.

ఆరోగ్యవంత సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం

ఆత్రేయపురం, సెప్టెంబరు25: ప్రజలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి స్వచ్ఛత హీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. బుధవారం ర్యాలిలో పారిశుధ్య కార్మికులతో కలిసి స్వచ్ఛతహీ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఇంటింటికి వెళ్లి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమ కరపత్రాలను, స్టిక్కర్లను అందించారు. హైస్కూల్ విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, మాజీ సమితి అధ్యక్షుడు మద్దూరి సుబ్బారావు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ముళ్లపూడి భాస్కరరావు, కాయల జగన్నాథం, మెర్ల నాగేశ్వరరావు, పెండెం వెంకన్న పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర విజన్‌లో భాగస్వాములు కావాలి

స్వర్ణాంధ్ర విజన్-2047 ప్రణాళికలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. బుధవారం ర్యాలి పంచాయతీ కార్యాలయం వద్ద ఇది మంచి ప్రభుత్వం ప్రజావేదిక ద్వారా ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్ 2047 రూపకల్పనలో రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొని డాక్యుమెంట్ తయారీలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే బండారుతో పాటు జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, స్వర్ణాంధ్ర విజన్‌లో పాల్గొని సర్టిఫికెట్లు పొందారు. జడ్పీటీసీ బోనం సాయిబాబా, సర్పంచ్ కొడమంచిలి లక్ష్మి, ఎంపీడీవో నాతి బుజ్జి, తహసీల్దారు రాజేశ్వరరావు, ఈవోపీఆర్డీ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జగన్ ఎగ్గొట్టిన బకాయిలు చంద్రబాబు చెల్లింపులు

అల్లవరం, సెప్టెంబరు 25: జగన్ పాలనలో చెల్లించకుండా వదిలేసిన రైతుల ధాన్యం బకాయిలు రూ.1,600కోట్లు, పంచాయతీ కాంట్రాక్టు పనుల బకాయిలు రూ.1,452కోట్లు, అమరావతి రైతు భూమి బకాయిలు రూ.400కోట్లు సీఎం చంద్రబాబు చెల్లించి అండగా నిలిచారని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. గుండెపూడి పంచాయతీ వద్ద బుధవారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం సభలో ఆయన మాట్లాడారు. జగన్ రాష్ట్రానికి రాజధాని లేకుండా అరాచక పాలన చేశారని దుయ్యబట్టారు. గ్రామంలో పర్యటించి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలు అందించి ఇళ్లకు స్టిక్కర్లను వేశారు. సభలో సర్పంచ్ గుంటూరి కృష్ణంరాజు, డిప్యూటీ కలెక్టర్ ఏ.మధుసూదనరావు, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు వేగిరాజు వెంకట్రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, బొర్రా ఈశ్వరరావు, మాకే కృష్ణమూర్తి, ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్, ఏఈ జి.సంపన్, పోతుల నరసింహారావు, పోతుల నాగలక్ష్మి, గుంటూరి బాలవెంకట్రాజు, కేవీ, పోతుల రఘు, తిక్కిరెడ్డి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి పిల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతీ అధికారి జవాబుదారీతనంగా పనిచేయాలి

అంతర్వేది, సెప్టెంబరు 25: ప్రతీ గ్రామంలో విధులు నిర్వహించే అధికారి ప్రజలకు జవాబుదారీ తనంగా పనిచేయాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. అంతర్వేది పంచాయతీ వద్ద బుధవారం నియోజకవర్గ సమన్వయకర్త గుండుబోగుల పెద్దకాపు అధ్యక్షతన స్థానిక సర్పంచ్ పోతురాజు నరసింహారావు(కిశోర్) ఆధ్వర్యంలో జరిగిన ప్రజావేదిక ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వర్షాలకు తీరప్రాంత గ్రామాలు జలమయం కాకుండా చర్యలు తీసుకుంటానన్నారు. ప్రజావేదికలో మహిళలు సమస్యలు విన్నవించుకున్నారు. చిటికెల రామ్మోహనరావు, రుద్రరాజు పద్మరాజు, గుబ్బల ఫణికుమార్, గుండుబోగుల పెద్దకాపు, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, పోతురాజు కృష్ణ, ముప్పర్తి నాని, చాగంటి స్వామి, బర్రే శ్రీను, చొప్పల బాబూరావు, దాసరి వాసు, పోతురాజు సురేష్, ఎంపీడీవో సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్, కార్యదర్శి యడ్ల వీవీ కుమార్‌బాబు, దీపాటి మిథిన్, స్థానిక పెద్దలు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్లకు పదోన్నతులు కల్పించాలి

అమలాపురం టౌన్, సెప్టెంబరు 25: అర్హులైన అంగన్‌వాడీ హెల్పర్లకు పదోన్నతులు ఇవ్వాలని వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కూటమి కార్యదర్శి కె.కృష్ణవేణి డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యాలయంలో బుధవారం బి.వెంకటలక్ష్మి అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించగా కృష్ణవేణి ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఐసీడీఎస్ అధికారులు నెలల తరబడి సమస్యలు పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. సమస్యల పరిష్కారం కోరుతూ అక్టోబరు 3న ముమ్మిడివరం ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు పి.అమూల్యా, ఎం.దుర్గమ్మ, రత్నకుమారి, విజయలక్ష్మి, జయలక్ష్మి, మహేశ్వరి, రత్నకుమారి, సుజాత, సూర్యకళ, కె.వెంకటలక్ష్మి, ఎం.నూకరత్నం పాల్గొన్నారు.

మల్టీ డిజబులిటీ వ్యక్తుల గుర్తింపునకు కార్యక్రమం

యానాం, సెప్టెంబరు 25: యానాం బీచ్ రోడ్డులోని ఉమాఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీలో బుధవారం మల్టీ డిజబులిటీ వ్యక్తులను గుర్తించడానికి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రాజెక్టు కోఆర్డినేటర్ నాయుడు మాట్లాడుతూ బహుళ వైకల్యం గల వ్యక్తులను గుర్తించి, వారికి ఉచితంగా ఇంటి వద్దే ఫిజియోథెరపి, న్యూట్రిషన్ ఫుడ్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఫ్యాకల్టీ రాంజీ అంబేద్కర్, స్వాతి, సంపత్, గీత విజయదుర్గ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర 2047 విజన్‌పై అవగాహన సదస్సు

కొత్తపేట, సెప్టెంబరు 25: విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర 2047 విజన్ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీరాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ దేశంలో నెంబరు 1 టూరిజం రాష్ట్రంగా వెలుగొందడానికి అందరూ కలిసికట్టుగా కృషిచేయాలన్నారు. స్థానిక సిద్ధార్థ కళాశాలలో తహసీల్దారు వై.రాంబాబు మాట్లాడుతూ 2047 నాటికి వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, తదితర అంశాలతో కూడిన ఆర్థిక అభివృద్ధిపై దృష్టి సారించేందుకు యూఆర్ఎల్ లింక్ ద్వారా అందరూ తమ అభిప్రాయాన్ని తెలియచేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకుడు డాక్టర్ జి.శ్రీనివాసులు, డాక్టర్ కె.సత్యనారాయణ, డాక్టర్ కె.అంకమరావు, సీహెచ్ నాగారాణి, సిద్ధార్థ ప్రిన్సిపాల్ కట్టా నాగమోహన్, రెడ్డి సత్యనారాయణ, ఆర్‌ఐ ఏడుకొండలు పాల్గొన్నారు.

సమాజ సేవకుడు శంకరరావు

మామిడికుదురు, సెప్టెంబరు 25: వాసంశెట్టి శంకరరావు సమాజానికి అనేక సేవలు అందించారని టీడీపీ రాజోలు నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు ఈలి శ్రీనివాస్ పేర్కొన్నారు. శంకరరావు సంస్మరణ సభ మామిడికుదురులోని ఆయన స్వగృహం వద్ద బుధవారం జరిగింది. పలువురు ఆయన చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. టీడీపీ నాయకుడిగా, శెట్టిబలిజ సంఘ నాయకుడిగా, వృత్తి కళాకారుల సంఘ కార్యదర్శిగా, పూలే సామాజిక చైతన్యవేదిక అధ్యక్షుడిగా ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. టీడీపీ నాయకులు, వృత్తి కళాకారుల సంక్షేమ సంఘ సభ్యులు, సంక్షేమ సభ్యులు పాల్గొన్నారు.

కల్తీ నెయ్యి ఘటనపై పాదయాత్ర

మలికిపురం, సెప్టెంబరు 25: తిరుపతి లడ్డూలో నెయ్యి కల్తీ ఘటనను నిరసిస్తూ రాజోలు నియోజకవర్గ హిందూ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గుడిమెళ్లంక వంతెన వద్ద నుంచి స్థానిక ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ బుధవారం పాదయాత్ర చేశారు. కార్యక్రమంలో గుండుబోగుల పెద్దకాపు, రుద్రరాజు పద్మరాజు, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, మాలే శ్రీనివాస్‌నగేష్, మంగెన భూదేవి, జంపన సత్యనారాయణరాజు, అడబాల యుగంధర్, చెల్లింగి సత్యనారాయణ, మల్లిపూడి సత్తిబాబు, గుబ్బల శ్రీనివాస్, చాగంటి స్వామి, కూటమి శ్రేణులుపాల్గొన్నారు.

అబ్దుల్‌అజీజ్ నియామకంపై హర్షం

మామిడికుదురు, సెప్టెంబరు 25: రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా అబ్దుల్ అజీజ్‌ను నియమించడంపై టీడీపీ ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి హాజీ ముఖరం హుస్సేన్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు స్వగృహంలో స్వీట్లు పంచి ఆనందం వ్యక్తం చేశారు. ముస్లింలకు పెద్దపీట వేస్తున్న సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. మీర్ కరమ్‌అలీ, అబ్రార్ హుస్సేన్, ఎంకే అబ్బాస్, పాల్గొన్నారు.

జీవనాధారం కల్పించాలని నిరసన

మామిడికుదురు, సెప్టెంబరు25: మగటపల్లిలో ఖాళీగాఉన్న ప్రభుత్వ భూమిలో 30ఏళ్లుగా బడ్డీ కొట్టు పెట్టుకుని జీవిస్తున్నానని, దానిని ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేశారని నామన రాజనరసింహారావు (రాజబాబు) ఆవేదన వ్యక్తం చేశాడు. మళ్లీ అక్కడే బడ్డీ పెట్టుకుంటే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు సూరిశెట్టి శ్రీకృష్ణమోహనరావు తన తోటకు వెళ్లే దారిలో బడ్డీ పెట్టడం ఏమిటని అడ్డుపడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై గ్రామస్తులతో కలిసి బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందించాడు. నామన నాగేశ్వరరావు, బొంతు మణిరాజు, బొలిశెట్టి నాగభూషణం, నామన నాని, నామన నాన్నారు, గోగి గోపి పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, సెప్టెంబరు 25: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అన్నదాన భవన నిర్మాణానికి అమలాపురానికి చెందిన కొరుప్రోలు నాగసూర్యకాంతం రూ.1,00,116 విరాళం సమర్పించారు. దాతలకు ఆలయ ఉపకమిషనరు చక్రధరరావు స్వామివారి చిత్రపటం అందజేశారు.

ముమ్మిడివరం ఎలక్ట్రికల్ ఏఈగా ఏసురాజు



ముమ్మిడివరం,సెప్టెంబరు25: ముమ్మిడివరం ఎలక్ట్రికల్ ఏఈగా ఎస్.ఏసురాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ద్రాక్షారామ నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఏఈగా పనిచేసిన వి.శివాజీ భీమడోలు బదిలీపై వెళ్లారు.

ఎలక్ట్రికల్ ఏఈగా జీవీ ఆచార్యులు



పి.గన్నవరం, సెప్టెంబరు25: పి.గన్నవరం ఎలక్ట్రికల్ ఏఈగా జీవి ఆచార్యులు బాధ్యతలు స్వీకరించారు. అమలాపురంలో కనస్ట్రక్షన్ అధికారిగా పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఏఈ పనిచేసిన ఎస్.ఆనందరాజు బదిలీపై అమలాపురం టౌన్ జేఈగా వెళ్లారు. కార్యాలయ సిబ్బంది. లైన్‌మెన్లు ఆనందరాజును ఘనంగా సన్మానించారు.

ఎలక్ట్రికల్ డీఈఈగా రత్నాలరావు

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 25: ఏపీ ఈపీడీసీఎల్ రామచంద్రపురం డీఈఈగా కె.రత్నాలరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రత్నాలరావును విద్యుత్‌శాఖ ఉద్యోగులు సత్కరించారు. వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని ఉద్యోగులకు సూచించారు.

రేపు పి.గన్నవరంలో జాబ్ మేళా

అమలాపురం టౌన్, సెప్టెంబరు 25: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల27న పి.గన్నవరం గ్రేస్ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా అధికారి పి.లోకమాన్ తెలిపారు. జాబ్‌మేళాలలో 17కంపెనీల్లో పనిచేసేందుకు 900మందికిపైగా ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, పీజీ, బీఎస్సీ నర్సింగ్ వంటి కోర్సులు చేసిన వారు అర్హులన్నారు. వివరాలకు సెల్9703966340ను సంప్రదించాలన్నారు.

వరద బాధితులకు రూ.50వేలు సాయం

అమలాపురంటౌన్, సెప్టెంబరు 25: విజయవాడ వరద బాధితులకు ఆజాద్ ఫౌండేషన్ రూ.50వేల విరాళం చెక్కును బుధవారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు అందజేశారు. ఫౌండేషన్ సభ్యులుమాకిరెడ్డి వీఎస్ఎస్ పూర్ణిమ, పురాణపండ లక్ష్మీగణేష్ తమ బృందాలతో విజయవాడ వెళ్లి వరద బాధితులకు సేవలందించినట్టు వివరించగా కలెక్టర్ అభినందించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు యల్లమిల్లి నాగసుధాకొండలరావు ఆధ్వర్యంలోజరిగిన కార్యక్రమంలో సభ్యులు అడ్డాల గోపాలకృష్ణ, రంకిరెడ్డి కాశీవిశ్వనాథం, ఆకెళ్ల నారాయణమూర్తి, వంటెద్దు బాబి, నిమ్మకాయల సుబ్బారావు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్
శ్రీలలిత	: ఉత్సాహం
శేఖర్ స్క్రీన్-1	: కళింగ
శేఖర్ స్క్రీన్-2	: ఆయ్
రమా	: మత్తువదలరా-2
గణపతి	: కమిటీ కుర్రోళ్లు
వెంకటపద్మావతిస్క్రీన్-1	: సరిపోదా శనివారం
వెంకటపద్మావతి స్క్రీన్-2	: గొర్రె పురాణం

వ్యవసాయ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ముమ్మిడివరం, సెప్టెంబరు 25: వ్యవసాయ, అనుబంధ శాఖల సేవలు రైతు ముంగిటకు తెచ్చేందుకు పొలం పిలుస్తోంది గ్రామ సభలు నిర్వహిస్తున్నామని వ్యవసాయ అధికారి ఎస్.ప్రశాంత్‌కుమార్ పేర్కొన్నారు. అయినాపురంలో సర్పంచ్ మోకా రామారావు అధ్యక్షతన బుధవారం పొలం పిలుస్తోంది గ్రామసభ నిర్వహించారు. వ్యవసాయం, వాటి అనుబంధ శాఖలు ఏయే రకాల సేవలను అందిస్తుందో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బొంతు నాగరాజు, ఇందుకూరి పాండురంగరాజు, మట్ట సత్తిబాబు, పశుసంవర్ధకశాఖ అధికారి జగదీష్, ప్రకృతి వ్యవసాయ మాష్టర్ ట్రైనర్ ఏడుకొండలు, రైతులు, గ్రామ రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు గురుకుల విద్యార్థినుల ఎంపిక

అల్లవరం, సెప్టెంబరు25: జిల్లా స్థాయిలో అండర్-19 విభాగంలో జరిగిన ఆటల పోటీల్లో సీనియర్ ఇంటర్ చదువుతున్న జి.లలిత త్రోబాల్‌లో, ఎం.అపర్ణ టెన్నికాయిట్‌లో విజయం సాధించిరాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ కిరణ్మయి తెలిపారు.నియోజకవర్గ పరిధిలో జరిగిన స్కూల్‌గేమ్స్‌లో కె.దయాని, బి.తుమ్మిజ్యోతి, చెస్‌లో కె.లేఖనశ్రీ, టి.శ్రవణ్య, టి.రోజాలు యోగాలోను రన్నింగ్‌లో బి.సాయినాగదుర్గ, కె.మేరీగ్రేష్ జిల్లా పోటీలకుఎంపికయ్యారన్నారు.

వైసీపీ మండల కన్వీనర్ గోవిందు మృతి



కపిలేశ్వరపురం, సెప్టెంబరు 25: వైసీపీ మండల కన్వీనర్, సీనియర్ నాయకుడు శీలం గోవిందు బుధవారం తెల్లవారుజామున మాచరమట్లలోని స్వగృహంలో మృతిచెందారు. వైసీపీ మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల కోఆర్డినేటర్లు తోట త్రిమూర్తులు, పిల్లి సూర్యప్రకాష్ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు, జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు గ్రామసర్పంచ్ వాసంశెట్టి సునీత విష్ణుమూర్తి, తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

15వ రోజుకు చేరుకున్న అధ్యాపకుల నిరసన దీక్ష

మలికిపురం, సెప్టెంబరు 25: మలికిపురం డిగ్రీ కళాశాల అధ్యాపకులు చేస్తున్న నిరసన దీక్ష బుధవారంతో 15వ రోజుకు చేరుకుంది. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, రుద్రరాజు పద్మరాజు దీక్షా శిబిరాన్ని సందర్శించి అధ్యాపకులకు సంఘీభావం తెలిపారు. కళాశాలలో జరుగుతున్న కార్యకలాపాలపై ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని నియమించినట్టు తెలిపారు. దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపిన వారిలో గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, గుండుబోగుల పెద్దకాపు, మేడిచర్ల సత్యవాణి, బోనం రాజు, మాలే శ్రీనివాసనగేష్, రేపూరి ఏసు, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

విస్ఫోటం బాధితులకు ఆర్థిక సాయం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 25: పట్టణ శివారు రావులచెరువులో ఇటీవల జరిగిన మందుగుండు సామగ్రి విస్ఫోటంలో బాధితులను ఆదుకునేందుకు శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ ముందుకు వచ్చింది. ఈప్రమాదంలో 14మంది తీవ్రంగా గాయపడగా గొవ్వాల నాగలక్ష్మి మృతిచెందింది. లక్ష్మి కుటుంబానికి రూ.1.30లక్షలు, బాధితులు చొల్లంగి మారుతీ సుబ్రహ్మణ్యం, కట్టా వెంకట్, దూనబోయిన సుబ్బలక్ష్మి, దూనబోయిన గాయత్రి, పితాని శాంతి, బొక్కా ప్రియాంకకు రూ.10వేలు చొప్పున నగదును అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, మట్టపర్తి మీరాసాహెబ్‌శెట్టి, గొవ్వాల రాజేష్, కుడుపూడి భరత్‌భూషణ్, దొమ్మేటి రాము, సంసాని బులినాని, కుడుపూడి బాబు, మట్టపర్తి నాగేంద్ర, చెల్లుబోయిన నాని, దొంగ చిన్నా, కొప్పిశెట్టి మురళీ, గుత్తుల చిరంజీవి, కముజు రమణ, గుత్తుల రాజు, విత్తనాల శేఖర్, దొమ్మేటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది సదస్సు

అల్లవరం, సెప్టెంబరు 25: రైతు సంక్షేమానికి సంబంధించి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో ఎస్వీవీ సత్యనారాయణ, సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి కోరారు.బోడసకుర్రు పంచాయతీ రైతు సేవా కేంద్రం వద్ద జరిగిన పొలం పిలుస్తోంది సభలో పలు సూచనలు చేశారు. పశువైద్యాధికారి డాక్టర్ నారాయణరావు, ఏఈవో మోహన్, బాలకృష్ణ, అడపా వెంకటేశ్వరరావు, ముత్యాల బాబి, ఏ.గోపాలం, అయినవిల్లి సూర్యనారాయణ, దొమ్మేటి రాజు, పంచాయతీ కార్యదర్శి ఎస్.దుర్గాశ్రీనివాస్, జల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యా శాఖ ఉన్నతాధికారులతో మల్లాడి భేటీ



యానాం, సెప్టెంబరు 25: యానాంలో విద్యా శాఖకు సంబంధించిన పలు పెండింగ్ అంశాలపై పుదుచ్చేరి విద్యా శాఖ కార్యాదర్శి జవహర్, డైరెక్టర్ ప్రియదర్శినిలతో పుదుచ్చేరి ప్రభుత్వడిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు భేటీ అయ్యారు. పాఠశాలల వేళల్లో మార్పులు గురించి చర్చించామన్నారు. అవుట్‌సోర్సింగ్ విధానంలో స్టేడియం, స్విమ్మింగ్‌పూల్ తదితర విభాగాల్లో పనిచేస్తోన్న సిబ్బంది పెండింగ్ జీతాలు, పుదుచ్చేరిలో పనిచేస్తోన్న ముగ్గురు ఉపాధ్యాయులను యానాం బదిలీ తదితర అంశాలపై మల్లాడి చర్చించారు. యానాం శివారు గిరియంపేటలో కేంద్ర ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలకు విద్యా శాఖ ద్వారా విడుదల చేయాల్సిన నిధులపై విద్యా శాఖ కార్యాదర్శిని కోరామన్నారు.

విద్యార్థికి ఉపాధ్యాయుల ఆర్థిక సాయం

రాజోలు, సెప్టెంబరు 25: కడలి నంబరు-3 ప్రాథమిక పాఠశాలలో నాల్గో తరగతి చదువుతున్న వడ్డి ఆయుష్‌రాజు కేమియా (బ్లడ్ కేన్సర్)తో విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కడలి కాంప్లెక్సు ఉపాధ్యాయులు, మండలంలోని ఇతర ఉపాధ్యాయులు సమకూర్చిన రూ.25,711 నగదును విద్యార్థి కుటుంబ సభ్యులకు బుధవారం సర్పంచ్ చొప్పల గుణనాథ్ అందజేశారు. ఉపాధ్యాయులకు సర్పంచ్ గుణనాథ్, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్ఎస్ఎస్ ఆచార్యులు, బిళ్ల రాచయ్య, అప్పారి దుర్గాప్రసాద్, ఎం.సత్యనారాయణ, కట్టా కిరణ్‌కుమార్, కే వీఎస్ఎన్ బాబు, టి.బాలాజీ, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ దీక్షకు మద్దతుగా కాగడాల ర్యాలీ

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 25: హిందూ ధర్మసేన ఆధ్వర్యంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా బుధవారం అంగర శ్రీవేణుగోపాలస్వామి ఆలయం నుంచి గ్రామశివారులోని ఆంజనేయ స్వామి ఆలయం వరకు కాగడాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, జనసేన టీడీపీ, బీజేపీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కాలభైరవ స్వామికి పూజలు

అయినవిల్లి, సెప్టెంబరు 25: అయినవిల్లి శ్రీసిద్ధివినాయకస్వామి దేవస్థానంలోని క్షేత్ర పాలకుడు కాలభైరవ స్వామికి అష్టమి తిథిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కాల భైరవస్వామిని పూజిస్తే అష్టమ శని, ఏలినాటి శని బాధల నుంచి ఉపశమనం కలుగుతుందని భక్తుల విశ్వాసం. బుధవారం భక్తులు కాలభైరవస్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

కాట్రేనికోన, సెప్టెంబరు 25: కందికుప్ప పెట్రోల్ బంకు ఎదురుగా డొంకల్లో వంద 180ఎంఎల్ మద్యం సీసాల మూటను బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీసాలపై ఎటువంటి లేబుల్స్ లేవని, అనుమానితులను విచారిస్తున్నట్లు ఎస్‌ఐ అవినాష్ తెలిపారు.

విజయకుమార్‌కు డాక్టరేట్

కాట్రేనికోన,సెప్టెంబరు25: చెయ్యేరు ఇంజనీరింగు కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ కె.విజయకుమార్‌కు సీఎస్ఈ విభాగంలో ఎఫ్రేమ్ వర్క్‌ఫర్ ఆటోమేటిక్ స్పీకర్ డయారైజేషన్ సిస్టమ్ యూజింగ్ డీప్ లెర్నింగ్ సిద్ధాంత వ్యాసానికి జేఎన్‌టీయూ గౌరవడాక్టరేట్‌ను ప్రదానం చేసింది. బుధవారం కళాశాలలోజరిగినకార్యక్రమంలోకరస్పాండెంట్ డీవీఎస్ఎస్‌వర్మ,ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసకుమార్, సందీప్, వైస్‌ప్రిన్సిపాల్ కేవీవీ బాపిరాజుఅభినందించారు.

ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉండండి

మండపేట, సెప్టెంబరు25: చిరుతపులి సంచారంపై ప్రజలు ఆందోళన చెందవద్దని రామచంద్రపురం ఆర్డీవో సుధాసాగర్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశాలో జిల్లా అటవీశాఖ అధికారి ఎం.వి.ప్రసాదరావు, టౌన్‌ఎస్‌ఐ హరికోటిశాస్త్రితో కలిసి మాట్లాడారు. కడియం నర్సరీల నుంచి మండపేట, ఆలమూరు మండలాల్లో సంచరించే అవకాశం ఉన్నట్లు హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రి సమయాల్లో బయట తిరగవద్దని, ఇళ్లల్లోనే ఉండాలని పేర్కొన్నారు. చిరుతపులి కనిపిస్తేదానిని అనుసరించవద్దన్నారు. చిరుత పులి జాడతెలిస్తే 18005425909, 9849156162, 9705909066లకు సమాచారం ఇవ్వాలన్నారు. తహసీల్దార్ టి.తేజేశ్వరరావు, డీటీ అశోక్‌ప్రసాద్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

అంతర్వేది, సెప్టెంబరు 25: అప్పనరామునిలంక గ్రామంలో ఎజీఎఫ్‌ఐ మండలస్థాయి ఆటల పోటీల్లో 17మంది విద్యార్థులు గెలుపొంది నియోజకవర్గస్థాయికి ఎంపికయ్యారు. బ్యాడ్మింటన్, వాలీబాల్ విభాగాల్లో ఏడుగురు విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికైనట్టు హెచ్ఎం జేవైకే సత్యనారాయణ తెలిపారు. అనంతరం విద్యార్థులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరా మల్లికార్జునరావు, సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు పాల్గొన్నారు.

ఎంఈవోగా నాగకుమార్



రావులపాలెం, సెప్టెంబరు 25: రావులపాలెం మండల విద్యాశాఖాధికారి-1గా ఆర్.నాగకుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఇప్పటివరకు మండపేట ప్రభుత్వ హైస్కూల్ హెచ్‌ఎంగా పని చేశారు.

నూతన మద్యం పాలసీతో గీత కులాలకు మేలు

కొత్తపేట, సెప్టెంబరు 25: కూటమి ప్రభుత్వం తీసుకువచ్చే నూతన మద్యం పాలసీతో గీత కులాలకు ఎంతో మేలు జరుగుతుందని తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బొక్కా ప్రసాద్ అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం గీత కార్మికులు పడుతున్న ఇబ్బందులను ఏ మాత్రం పట్టించుకోలేదని, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ గీత కార్మికులు పడుతున్న ఇబ్బందులను గుర్తించారన్నారు. నూతన మద్యం పాలసీలో గీత కులాలకు 10శాతం రిజర్వేషన్ కల్పించి 340మద్యం షాపులు కేటాయించడం హర్షనీయమన్నారు. మద్యం షాపుల దరఖాస్తు రుసుం కూడా రూ.లక్షకు తగ్గించారని దానిని రూ.50వేలకు తగ్గించాలని బొక్కా ప్రసాద్ కోరారు.

ఆలమూరులో సామూహిక సీమంతాలు

ఆలమూరు, సెప్టెంబరు 25: ఆలమూరులో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేసి సామూహిక సీమంతాలు నిర్వహించారు. అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ తెలుగురైతు అధికార ప్రతినిధి ఈదల సత్తిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 25మంది గర్భిణులకు చీరలు, పండ్లు, స్వీట్స్, పలు రకాల వస్తువులను అందించారు. పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకుంటే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈదల రాంబాబు, వంటిపల్లి సతీష్, ఈదల నల్లబాబు, రామానుజుల శేషగిరిరావు, మానేపల్లి శ్రీను, కడియాల శ్రీను, సిరిగినేడి పట్టాభి, చల్లా ఏడుకొండలు పాల్గొన్నారు.

సొసైటీ మాజీ అధ్యక్షుడు గాంధీరాజు మృతి



రావులపాలెం, సెప్టెంబరు 25: పొడగట్లపల్లి సొసైటీ మాజీ అధ్యక్షుడు పెన్మత్స వెంకటసుబ్రహ్మణ్యచలపతిజవహర్‌లాల్(గాంధీరాజు) మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఈయన గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్‌గా పనిచేశారు. పలువురు సంతాపం వ్యక్తం చేశారు.